


మాట నిలబెట్టుకుంటాం

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలకు కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



మళ్లీ.. అవిశ్వాస లొల్లి

'పట్నం' మున్సిపాలిటీలో మళ్లీ అవిశ్వాస మునలం పుట్టింది. వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు నోటీసులు అందజేశారు. 8లో▸



న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌ను కలిసిన చింపుల సత్యనారాయణరెడ్డి



చేవెళ్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇటీవల రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా నియమితులైన చింపుల సత్యనారాయణరెడ్డి కలిశారు. సోమవారం ఉదయం హైదరాబాద్ లోని సీఎం నివాసంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి వేంకటేశ్వర స్వామి విగ్రహం బహూకరించారు. తనకు అవ కాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞ తలు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యా.పోచయ్య ఆధ్వర్యంలో మం డల పరిధిలోని ఉపాధ్యాయులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. మండలంలోని ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధ్యా యులు నగరంలోని ముఖ్యమంత్రి నివాసంలో సోమవారం కలిసి సన్మానించారు.

కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ



తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట మాధవరావు

కొందుర్గు: ఆర్మీ జవాన్ అశోక్ రెడ్డి వద్ద లంచం తీసుకున్నారంటూ పత్రికలు, సోషల్ మీడి యాలో వైరల్ కావడంతో అధికారులు రంగం లోకి దిగారు. షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధ వరావు సోమవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరి శీలించారు. ప్రైవేట్ వ్యక్తి హేమంత్‌కుమార్ ప్రభుత్వ పరమైన రికార్డులిచ్చి రైతుల వద్ద డబ్బులు తీసుకోవడం ఏమిటని తహసీల్దార్ రమేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిష్ట య్యను ప్రశ్నించారు. కార్యాలయంలో ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు ఉండగా పహాణి, ఆర్ఓఆర్ పత్రాలు ఇవ్వడానికి ఎందుకు జాప్యం చేస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేసీఆర్‌ను కలిసిన నాయకులు



కందుకూరు: మాజీ సీఎం కేసీఆర్‌ను హైద రాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారె డ్డితో పాటు మండలానికి చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసినవారిలో బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ నాయక్, గోవర్ధన్‌నాయక్, గణేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

జెల్లీలో జెర్రి !



కందుకూరు: సూపర్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఆహా రంలో విష పురుగులు కనిపించడంతో వినియోగ దారులు హడలిపోయారు. మండల పరిధిలోని కొత్తగూడ చౌరస్తాలో నివసిస్తున్న కె.చెన్నారెడ్డి కుటుంబ సభ్యులు ఈ నెల 3న శంషాబాద్ సమీపంలోని మెట్రో సూపర్ మార్కెట్‌కు వెళ్లి ఇంటికి అవసరమైన వంట సామగ్రి, ఇతర తినుబండారాలు కొనుగోలు చేశారు. అందులో పిల్లల కోసం కొన్న ఫ్రూటీ జెల్లీ పుడ్డింగ్‌ను ఆదివారం రాత్రి తినడానికి ప్యాక్ చేసి ఉన్న బాక్స్ తెరిచారు. అందులో విడివిడిగా ఉన్న ఒక ప్యాక్‌లో మృతి చెందిన కాళ్ల జెర్రీ, మరోదాంట్లో ఇంకో పురుగు కనిపించాయి. చూడకుండా పిల్లలు తిని ఉంటే ఏం జరిగేదోనని వారు భయాందోళనకు గుర వుతున్నారు. సదరు కంపెనీపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తున్నారు.

రంజిత్ అస్త్రసన్యాసం!

పోటీకి ససేమిరా..

- కేసీఆర్‌తో ఉమ్మడి జిల్లా నేతల సమావేశానికి డుమ్మా
- తాజాగా మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ పేరు తెరపైకి



మాజీ సీఎం కేసీఆర్‌తో సమావేశమైన ఉమ్మడి జిల్లా నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అస్త్రస న్యాసం చేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేదిలేదని తెగేసి చెప్పారు. దీంతో గులాబీ అధిష్టానం పునరా లోచనలో పడింది. సిట్టింగ్ ఎంపీ పోటీకి వెనుక డుగు వేయడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఆఖరికి ఎన్నికల వేళ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి మొగ్గు చూపింది. ఇదే విషయాన్ని సోమవారం జరిగిన నియోజకవర్గ నేతల సమావేశంలో గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించారు. శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తొలుత చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం సమీక్షా సమావేశం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ అధిష్టానం.. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి మరోసారి బరిలో ఉంటారని ప్రక టించింది. కొన్నాళ్లు ఆయన ప్రచారం కూడా నిర్వహించారు. అనంతరం జరిగిన పరిణామాలు ఆయనను పునరాలోచనలో పడేశాయి. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి దంపతులు హస్తం గూటికి చేర డం.. పలువురు దిగువశ్రేణి నాయకులు కారు దిగ డం.. ఆత్మరక్షణలో పడేసింది. దీనికితోడు దేశవ్యా ప్తంగా కొనసాగుతున్న మోదీ హవా.. బీజేపీ బలమైన అభ్యర్థిని రంగంలోకి దించడం సైతం అయన వెనుకడుగుకు దారితీసింది. మరోవైపు కొం దరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకో వడం.. పైకి మాత్రం మర్యాదపూర్వకమేనని చెబు తున్నా.. అంతర్గతంగా కాంగ్రెస్‌కు సహకరిస్తారనే ప్రచారం కూడా రంజిత్‌ను గందరగోళంలోకి నెట్టిం ది. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యం లో ఈసారి పోటీకి దూరంగా ఉండడమే మేలనే అభిప్రాయానికి వచ్చిన ఆయన కొన్నాళ్లుగా మౌన ముద్ర దాల్చారు. ఈ పరిణామాలతో ఆత్మరక్షణలో పడ్డ బీఆర్ఎస్ హైకమాండ్ రంజిత్ వెనుకడుగుతో ప్రత్యామ్నాయంగా పలువురు పేర్లను పరిశీలించిం ది. మొదట మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ పేరు పరిశీలించినా ఆయన నిర్ణయంపై స్పష్టత రాకపోవడంతో మాజీ మంత్రి సబితారెడ్డి తన యుడు కార్తీక్‌రెడ్డి పేర్లు తెరమీదికి వచ్చింది. ఆయన కూడా ఆసక్తి చూపలేదని తెలిసింది. ఆ తర్వాత జెడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వంపై మొగ్గు చూపింది. ఆయన కాకపోతే కనీసం కుమారుడు వీరేశ్‌నైనా రంగంలోకి దిం చాలని గులాబీ దళపతి భావించారు. దీనిపై కాసా నితో సంప్రదించిన అధిష్టానం ఎట్టకేలకు ఆయ నను పోటీకి ఒప్పించింది. ఇదే విషయాన్ని సోమ వారం జరిగిన సమావేశంలో పార్టీ నేతలకు స్పష్టం చేసింది.

నిధుల కోసమే కలిశాం..

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం పై కూడా సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగి నట్లు తెలిసింది. నియోజకవర్గం అభివృద్ధి నిధుల అంశంపైనే తామంతా సీఎంను కలవాల్సి వచ్చింద ని.. ఇందులో రాజకీయ కోణం లేదని వారు వివరణ ఇచ్చినట్లు సమాచారం. సమావేశంలో మాజీ మంత్రి సబితారెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ ఎమ్మె ల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ సహా యువ నేతలు కార్తీక్‌రెడ్డి, కాసాని వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

ఓట్ల కోసమే డ్రామాలు

- బీఆర్ఎస్, బీజేపీని ప్రజలు నమ్మడం లేదు
- హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది
- మంత్రి జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్: బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఓట్ల కోసం డ్రామాలు ఆడుతున్నారని, ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాయికల్ టోల్ ప్లాజా సమీపంలోని ఓ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్య క్రమంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతిని ధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్ని కల నేపథ్యంలో ఓట్లు రాబట్టుకునేందుకు బీఆర్ ఎస్, బీజేపీ కుటిల రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని మండిపడ్డారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నా భిన్నం చేసిన పాపం ఆ పార్టీదేనని ధ్వజ మెత్తారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా హామీలను అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కేసీఆర్ రాచరిక పాలన కొనసాగించారని మండిపడ్డారు. ఇందుకు బహు మానంగా ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, ఆయనను ఫాంహౌస్‌కే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం కేశంపేట మండలం సంతాపూర్ ఎంపీటీసీ రాజు, ఫరూఖ్‌నగర్ మం డలం కొండన్నగూడ ఎంపీటీసీ పాత్లావత్ లక్ష్మి, కొందుర్గు ఎంపీపీ తనయుడు పోతురాజు గోపాల్ తదితరులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, తాండ్ర విశాల, వెంకట్ రాంరెడ్డి, కావలి శ్రీశైలం, ఇబ్రహీం, కృష్ణ, సుద ర్శన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోరం లేకపోవడంతో సమావేశం నుంచి బయటికి వచ్చిన కార్పొరేటర్లు

గట్టెక్కిన మీర్‌పేట మేయర్

కోరం లేక వీగిపోయిన అవిశ్వాసం

మీర్‌పేట: బీఆర్ఎస్ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. నెల రోజులుగా స్థానికంగా నెల కొన్న ఉత్కంఠకు చివరికి తెరపడింది. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్‌పై అవిశ్వాసం కోరుతూ సొంత పార్టీ కార్పొ రేటర్లతో పాటు బీజేపీ, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మరికొందరు కార్పొరేటర్లు మొత్తం 31 మంది గత నెల 22న కలెక్టర్‌కు లేఖ అందజేశారు. కలెక్టర్ ఆదే శాల మేరకు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి, కందూకురు ఆర్డీఓ సూరజ్‌కు మార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 11.30 గంటలు దాటినా సమావేశానికి సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో ఆర్డీఓ 12 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మొదటి నోటీసు జారీ చేశారు. ఆ తరువాత 12.30 గంట లకు క్యాంపు నుంచి నేరుగా కార్పొరేటర్లు ఒక్కొ క్కరుగా సమావేశానికి హాజరయ్యారు. సమావేశం జరగడానికి, అవిశ్వాసానికి మొత్తం 31 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా, 29 మందే ఉం డడంతో కోరం లేని కారణంగా అవిశ్వాసం వీగిపో యింది. ఈ సందర్భంగా మేయర్ పదవి ఆశించిన నీలారవినాయక్ మాట్లాడుతూ.. ఇప్పుడున్న మేయర్‌పై వ్యతిరేకత ఉండడంతోనే మొదట 35 మంది కార్పొరేటర్లు తమకు మద్దతు తెలిపారని, చివరకు ప్రలోభాలతో ముగ్గురు సభ్యులు సమావే శానికి రాలేకపోయారని ఆరోపించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్డీఓ, ప్రిసైడింగ్ అధికారి సూరజ్‌కుమార్ మాట్లాడుతూ.. అవిశ్వాసం నోటీసు ఇచ్చినప్పుడు 31 మంది సభ్యులు ఉన్నారని, సమావేశానికి 29 మందే హాజరయ్యారని అన్నారు. కోరం లేనందున సమా వేశాన్ని నిర్వహించలేమని, అవిశ్వాసం వీగిపో యిందని ప్రకటించారు.

సర్వే చేసి.. హద్దులు గీసి

- దుబ్బకుంట కబ్జాపై స్పందించిన రెవెన్యూ శాఖ
- కాపాడాలని కలెక్టర్, ఆర్డీఓకు స్థానికుల ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..



సర్వే నంబర్ 631లో సర్వే చేపడుతున్న రెవెన్యూ అధికారులు

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని దుబ్బకుం టను సోమవారం రెవెన్యూ అధికారులు పరిశీలిం చారు. 'దుబ్బకుంట .. కబ్జాదారుల కంట' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు స్పందించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి ప్లాట్లుగా మారిన కుంటను పరిశీలించారు. సర్వేయర్‌తో సర్వే చేపట్టి ప్రభుత్వ సర్వే నంబర్ 631కి హద్దులు ఏర్పాటు చేశారు.

లోపించిన సమన్వయం

కాగా, అధికారుల మధ్య సమన్వయ లోపం తేటతె ల్లమైంది. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమికి హద్దు రాళ్లు ఏర్పాటు చేసి వెళ్లారు. ఇరిగేషన్ అధికా రులు వచ్చి ఉంటే వాళ్ల రికార్డులను పరిశీలించి కుం ట పూర్తిగా సర్వే చేపట్టే వాళ్లం అని ఆర్ఐ పేర్కొ న్నారు. వారు స్పందించకపోతే తాము మాత్రం ఏం చేయగలం అని సమాధానమిచ్చారు. కాగా, ఇరిగేషన్ డీఈ ఉషారాణిని వివరణ కోరగా కేవలం కుంట తమ రికార్డుల్లో లేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. బిజీగా ఉండటంతోనే రాలేకపో యానని, విషయాన్ని కిందిస్థాయి సిబ్బందికి అప్ప గించానని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ఈఈ బన్సీలాల్ మాట్లాడుతూ.. వెంటనే చర్యలు చేపట్టాలని తమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని పేర్కొన్నారు.

కలెక్టర్, ఆర్డీఓకు ఫిర్యాదు

అధికారులు వెంటనే స్పందించి దుబ్బకుంటను కాపాడాలని తుర్కయంజాల్‌కు చెందిన స్థానికులు సోమవారం కలెక్టర్, ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న కుంటను రియల్ వ్యాపారులు ధ్వంసం చేయడం దారుణమని అన్నారు. అధి కారులు విచారణ చేపట్టి కుంటను కాపాడటంతో పాటు, కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకో వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ అనంత్‌రెడ్డి వెంటనే చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు.

పహాడీషరీఫ్ ఠాణాను సందర్శించిన రాచకొండ సీపీ

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌ను రాచ కొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి విషయమై ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు రిసెప్షనిస్టులు ఇస్తున్న మర్యా దను పరిశీలించారు. ఎంతో సున్నితమైన ఉద్యోగ బాధ్యతను నిర్వహిస్తూనే.. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం చేసేలా వ్యవహరించా లన్నారు. నేరాల నియంత్రణలో సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, పహాడీష రీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తదితరులు ఉన్నారు.



మహిళా కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న సీపీ

'పది'కి పక్కాగా ఏర్పాట్లు చేయాలి

- పరీక్షల నిర్వహణకు సిద్ధం కావాలి
- విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి పరీక్షలు సజా వుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికా రులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక తెలిపారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్‌రెడ్డి, డీఆర్ఓ సం గీత, జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలను సజావుగా, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని సూచించారు.

237 పరీక్ష కేంద్రాలు..
50,946 మంది విద్యార్థులు

ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 237 పరీక్ష కేంద్రాల్లో 50,946 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ప్రశ్నపత్రా లను భద్రపరిచేందుకు 37 పోలీస్ స్టేషన్లను గుర్తిం చినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించ కూడదని అన్నారు. ప్రతి కేంద్రంలో మొబైల్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమీపంలో జిరాక్స్ కేంద్రా లను మూసి వేయించాలని సూచించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆశ వర్కర్, ఏఎన్ఎంలు, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు. ఫర్ని చర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాల న్నారు. పరీక్ష సమ యాలను దృష్టిలో పెట్టుకొని బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదే శించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యా ర్థులు సరైన సమయంలో చేరుకునేలా ఉదయం గంట ముందు బస్సులు నడపాలని, పరీక్ష రాసిన తర్వాత ఇళ్లకు చేరుకునేలా చూడాలని సూచిం చారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సర ఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు.

సమన్వయంతో పనిచేయాలి

పరీక్షలు ప్రారంభమయ్యే సమయానికి ముందే విద్యా ర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకో వాలని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు చెప్పారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజి లేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు చూడాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మహిళా కానిస్టేబుల్ తప్పనిస రిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అధికారులు సమ న్వయంతో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వ హించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

కడ్తాల్: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఏఐసీసీ కార్య దర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి కావచ్చిన నేపథ్యంలో 'రేవంతన్నకు దన్నుగా.. ప్రజా పాలనకు అండగా' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని మైసిగండిలో ఆయన పర్యటిం చారు. మైసమ్మ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సంపత్‌కుమార్ మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ నియంతృత్వ పాలనలో ప్రజలు విసిగిపో యారని అన్నారు. వారి అవినీతి, అక్రమాలను భరించలేక గత అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెప్పి, ఇంటికి పంపించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజల పక్షాన అనేక ఉద్యమాలు, పోరా టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి పట్టం కట్టారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం లో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం అమలుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ నుంచి దరఖాస్తు చేసుకున్న 26 మందిలో ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపుకోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడిన విధంగానే కార్యకర్తలు, నాయకులు పార్టీ విజయానికి కృషి చేయాలని పిలు పునిచ్చారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రంలో పదేళ్లు పాలించిన బీఆర్ ఎస్ పార్టీకి పోటీ చేయడానికి అభ్యర్థులే కరువ య్యారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీసెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఆయా మండ లాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటాం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు తదితరులు

గ్యారంటీల అమలుకు కృషి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

చేవెళ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలకు కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన బీంభరత్ అధ్యక్షతన సోమవారం పార్లమెంటు ఎన్నికలపై నియోజక వర్గ స్థాయి నాయకుల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలు మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ, అని ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీలను అమలు చేస్తుందని చెప్పారు. రేపు మహిళలకు రూ.2,500ల పింఛన్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించే పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ట్రిబుల్ ఆర్ రోడ్డు..

చేవెళ్ల మీదుగా ఉన్న హైదరాబాద్–బీజాపూర్ రోడ్డు పనులను త్వరలోనే సీఎం ప్రారంభిస్తారని, ట్రిబుల్ ఆర్ రోడ్డు కూడా రాబోతుందని చెప్పారు. జీఓ 111పై కూడా సీఎంతో చర్చించడం జరిగిందని, దీనిపై కూడా త్వరలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ విధ్వంసం చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు.

సునీతారెడ్డికి ఎంపీ టికెట్ గ్యారంటీ

పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డికే టికెట్ వస్తుందని, ఆమెను భారీ మోజార్టీ తో గెలిపించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని నాయకులు పామెన భీంభరత్, చల్లా నర్సింహారెడ్డి, గౌరీ సతీష్, పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, వెంకటస్వామి, జనార్దన్‌రెడ్డిలు అన్నారు. కార్యక్రమంలో నాయకులు వసంతం, దర్శన్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆగిరెడ్డి, డీవీఆర్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బల్వంత్ రెడ్డి, శివకుమార్, పెంటారెడ్డి, శ్రీను, పెంటయ్యగౌడ్, ప్రభాకర్, రాంరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

సమన్వయ లోపం

నియోజకవర్గ స్థాయి సమావేశానికి సంబంధించిన సమాచారం పార్టీ శ్రేణులు అందరికీ అందలేదని పలువురు నాయకులు సభ దృష్టికి తెచ్చారు. విషయం తెలియక చాలమంది మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమీక్షకు రాలేదేని పేర్కొన్నారు.

వచ్చేసింది.. పవిత్రమాసం

- నేటి నుంచి రంజాన్ దీక్షలు ప్రారంభం
- నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టనున్న ముస్లింలు
- ప్రార్థనలకు ముస్తాబైన మసీదులు

షాబాద్/ పహాడీషరీఫ్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు చేస్తారు. వీటితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరనున్నాయని మత పెద్దలతో పాటు, వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మంగళవారం నుంచి దీక్షలు ప్రారంభం కానుండగా.. నెల రోజుల పాటు.. నియమం తప్పకుండా, వయోభేదం లేకుండా అత్యధికులు ఉపవాస దీక్షలను.. చేపట్టనున్నారు.

ప్రయోజనాలు..

ఉపవాస దీక్షల వలన ఎన్నో భౌతిక ప్రయోజనాలు చేకూరుతాయి. ముఖ్యంగా ఆరోగ్యంలో సమతుల్యత ఉంటుంది. రక్త ప్రసరన వ్యవస్థ బాగు పడుతుంది. గుండె నొప్పి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. జీర్ణవ్యవస్థకు రోజుకు సుమారు 14గంటల పాటు విశ్రాంతి లభిస్తుంది. దీనికి లివర్, చిన్నపేగులు, జీర్ణాశయాలు మొదలు అవయవాలు నూతనోత్తేజం పొందనున్నాయి. ఇదే విషయాన్ని.. ప్రపంచ స్థాయి ఆరోగ్య నిపుణులు మైకిల్‌జోసప్, శ్యామెల్, డాక్టర్ ఖాన్‌తో పాటు అనేకమంది వైద్యనిపుణులు ఈ రోజును ఆరోగ్యం కాపాడే మహిమగల విధానమని తమ ప్రయోగాలతో నిరూపించారు.

రక్త ప్రసరణ సాఫీగా..

సంవత్సరంలో 11నెలల పాటు రోజుకు 3 పూటలా భోజనం, మధ్యలో చిరుతిండ్లు, కాఫీ, టీలు తీసుకోవడం వలన జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి లేకుండా పోతుంది. ఏడాదిలో నెల రోజుల పాటు విధిగా ఉపవాస దీక్షలు పాటించడం వలన.. శరీరంలో బాగా వేడి పుట్టి పేగుల్లో పేరుకుపోయిన కొవ్వు కరిగిపోతుంది. రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. శరీరం తేలిక పడుతుందని దీక్ష చేపట్టేవారు స్పష్టం చేస్తున్నారు.

ఏర్పాట్లు ముమ్మరం..

నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుండటంతో.. పహాడీషరీఫ్ జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు.. ముస్లిం బస్తీల్లో పారిశుద్ధ కార్యక్రమాలు ముమ్మరం చేశారు. మసీదులకు వచ్చిపోయే దారుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మసీదుల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

పోలీస్ బందోబస్తు

రంజాన్ నేపథ్యంలో బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తపేట, ఎర్రకుంట, ఉస్మాన్‌నగర్, షాహీన్‌నగర్, వాదే సాల్హె హీన్, న్యూ బాబానగర్, క్యూబాకాలనీ, పహాడీషరీఫ్, జల్‌పల్లి ప్రాంతాల్లోని మజీదుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

నియమ నిష్టలతో దీక్ష

ఇస్లాం నాలుగో మూల స్తంభం ఉపవాసం. నమాజ్ వలే.. ఉపవాసం కూడా అన్ని యుగాల్లో ప్రవక్తలందరిపై విధిగా చేయడం జరిగింది. గతించిన సమాజాల్లో ఉపవాసాలు పాటించేవారు. ఉపవాసాల సంఖ్య వాటిని పాటించే రుతువులు, కాలాలలో తేడా ఉండేది. ప్రతి మతంలో ఉపవాసాన్ని పాటించడాన్ని చూస్తున్నాం. కానీ.. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతం ఉపవాసం ప్రత్యేకంగా చూస్తారు. దీన్ని అరబిక్ భాషలో సౌమ్ గాను, వ్యవహారిక ఉర్దూ భాషలో రోజాగా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 9వ నెల అయిన రంజాన్ మాసంలో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సౌమ్ అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినడం, తాగడం, మనోవాంఛలకు దూరంగా ఉండడం.

దీక్ష విధానాలు

సహర్: తెల్లవారు జామున 4:30 గంటల కల్లా తీసుకునే ఆహారాన్ని సహర్ అంటారు. సహర్ అనంతరం ఉపవాస దీక్ష ప్రారంభమవుతుంది.

ఇఫ్తార్: సూర్యుడు అస్తమించిన పది నిమిషాల లోపు తీసుకునే ఆల్పాహారాన్ని ఇఫ్తార్ అంటారు. దీంతో ఉపవాస దీక్ష విరమించిన్నట్లవుతుంది.

జకాత్: ధనికులు, పేదలు రంజాన్ వేళల్లో విధిగా పంచే నగదు, ఇతర దానాలను జకాత్‌గా భావిస్తారు. తమ వద్ద కనీసం 52తులాల వెండి, ఏడున్నర తులాల బంగారం, లేదా దానికి సమానమైన విలువగల డబ్బు ఒక సంవత్సర కాలం పాటు నిల్వ ఉంచుకున్న వారు.. అందులో 2.5 శాతాన్ని జకాత్ పేరిట దానం చేయాలి. రైతులైతే తాము పండించిన పంటను ఖర్చు పోను, మిగతా పంటలపై పదోవంతు ధాన్యాన్ని జకాత్‌గా పంచాలి.

తరావీ: తరావీ నమాజ్‌లో 30 అధ్యయనాలు గల ఖురాన్‌ను 26 రోజుల్లో వింటారు. ఖురాన్ కంఠస్థం చేసిన వ్యక్తి (ఆఫీజ్)ని 26వ రోజు రాత్రి సత్కరిస్తారు. తరావీ నమాజ్‌లో ముస్లింలంతా విధిగా పాల్గొంటారు.

ఫిత్రా: ఈ పండుగనే ఈద్‌ఫిత్రా అంటారు. ఈ రోజు నమాజ్ ఆచరించే ముందు కుటుంబసభ్యుల సంఖ్యను బట్టి ఫిత్రా రూపంలో ఒక్కొక్కరి పక్షాన 7.75 కిలోల బరువుగల గోధుమలు లేదా, దానికి సమానమైన నగదును పేదలకు పంచుతారు.

ఇబ్బంది లేకుండా చర్యలు



రంజాన్ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. 30 రోజుల పాటు మజీదుల వద్ద పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సదుపాయం కల్పిస్తాం. రాత్రి పూట నమాజ్‌లు చేయడాన్ని దృష్టిలో ఉంచుకొని లైటింగ్ సదుపాయం కూడా కల్పించాం.

– అల్లూరి వాణి రెడ్డి, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్

భార్యను కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: తన భార్యను ఎత్తుకెళ్లారని ఓ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉర్కొండ మండలం, జాకినాల్‌పల్లి గ్రామానికి చెందిన పోలే ప్రవీణ్‌కుమార్, రాధికలు ప్రేమ వివాహం చేసుకొని ఫిబ్రవరి 19 నుంచి రావిర్యాల్ గ్రామంలో అద్దెకు ఉంటున్నారు. పక్కనే ప్రవీణ్ కుమార్ సోదరి మమత ఉంటుంది. అతడు భార్యను ఇంట్లోనే వదిలిపెట్టి సోమవారం బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రవీణ్ భార్యతో అతని బంధువులు గొడవ పడ్డారు. అనంతరం కారులో రాధికను తీసుకొని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని మమత ప్రవీణ్‌కు ఫోన్ చేసి తెలిపింది. దీనిపై అతడు ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రెండు బైక్‌లు ఢీ, ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

ఆమనగల్లు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాం వివరాల ప్రకారం .. ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రసాద్, తన ద్విచక్ర వాహనంపై ఆకుతోటపల్లి ఉన్నత పాఠశాలకు విధుల నిమిత్తం వెళ్తున్నాడు. ఈ క్రమంలో జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఉపాధ్యాయున్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ప్రసాద్‌తో పాటు, ప్రమాదానికి కారణమైన ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన దార్ల రాములు, లక్ష్మణ్‌లు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రసాద్‌ను వెల్దండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, రాములు, లక్ష్మణ్‌లను హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. ప్రసాద్ తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించండి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

కేశంపేట: ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం ఉపాధి కూలీలతో తెలంగాణ వ్యవసాయ కార్మిక స ంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగ య్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గత సంవత్సరం ఉపాధి కూలీలకు రావాల్సిన బిల్లులను ఇవ్వలేదన్నారు. దీంతో కూలీలు పనులు మానేశారని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చి, నిరుపేదలకు అండగా నిలిచిందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం.. పథకానికి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, దామోదర్‌రెడ్డి, రామయ్య, నిర్మల, రత్నమ్మ, శంకరయ్య, కిష్టమ్మ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి మోదీ చేయూత



మాణిక్యమ్మగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

- ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి
- కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అన్నదాతల సమ్మేళనం

మహేశ్వరం: మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు పధాని నరేంద్రమోదీ 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్సీ ఎ.వెంటక నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మాణిక్యమ్మగూడ గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎరువుల కంపెనీ, కేంద్ర రసాయన, ఎరువుల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో అన్నదాతలకు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళలకు స్వయం ఉపాధి కలిపించే దిశగా ప్రధాని మోదీ దీదీ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. 21వ శతాబ్దంలో భారత దేశ సాంకేతిక విప్లవానికి నారీ శక్తి నాయకత్వం వహిస్తుందన్నారు. నేడు మహిళలు ఐటీ, అంతరిక్షం సైన్స్ రంగాలతో పాటు ఇతర రంగాల్లో రాణిస్తున్నారన్నారు. గ్రామీణా ప్రాంత మహిళలు లక్షధికారులుగా మార్చేందుకు ప్రధాని కృషి చేస్తున్నారన్నారు. ఈ పథకానికి ప్రచారం చేయడానికి ముందుకొచ్చిన కోరమండల్ ఎరువుల కంపెనీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకు ముందు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మహిళలకు డ్రోన్ పైలెట్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అళగప్పన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్, చంద్రయ్య గౌడ్, కోరమండల్ కంపెనీ ప్రతినిధులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

'ఈసీ'కి భువనగిరి ఎంపీ టికెట్ ఇవ్వండి

- ఎమ్మెల్యే రంగారెడ్డిని కోరిన కాంగ్రెస్ శ్రేణులు
- కష్టపడిని వారిని పార్టీ గుర్తిస్తుందన్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం రూరల్: బడుగు బలహీన వర్గాల నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్‌కు భువనగిరి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం 400 మంది పార్టీ శ్రేణులు శేఖర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎలాంటి పదువులు ఇవ్వకున్నా.. సుదీర్ఘ కాలంగా పార్టీ కోసం శేఖర్ పనిచేస్తున్నారని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. శేఖర్ సేవలను గుర్తించి, భువనగిరి పార్లమెంటు సీటు ఇప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని అధిష్టానం గుర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ఆర్తిక, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఏబ్లాక్ పార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ నారాయణరెడ్డి, యాచారం మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, యాచారం మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, కిసాన్‌సెల్ అధ్యక్షుడు బుగ్గరాములు, హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్ యాదవ్, వాజిద్, ముచ్చర్ల వెంకటేశ్, బాలయ్య, జంగయ్య, సతీష్, బుగ్గరాములు, శ్రీహరి, నరేష్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

- ప్రతి ఆటగాడు క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలి
- టోర్నీ నిర్వాహకులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి విజయానికి నాంది అని వాలీబాల్ టోర్నీ నిర్వాహకులు అన్నారు. జాతీయ క్రీడాకారుడు బోడ అనిల్‌కుమార్ స్మారకార్థం చేవెళ్ల మండలం దామరగిద్ద గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో రెండురోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ టోర్నీ ఆదివారం రాత్రితో ముగిశాయి. రెండు విభాగాలుగా జరిగిన ఈ పోటీల్లో.. దామరగిద్ద జట్టు ప్రథమ స్థానంలో నిలవగా.. రన్నరప్‌గా షాదనగర్ జట్టు, తృతీయస్థానంతో అజీజ్‌నగర్ జట్టు సరిపెట్టుకుంది. ఈ సందర్భంగా విజేతలకు మాజీ సర్పంచులు వెంకటేశం గుప్తా, మధుసూదన్ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడారు. ప్రతి ఆటగాడికి క్రీడాస్ఫూర్తి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, సైనిక్ దల్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, గ్రామస్తులు అనిల్, అంజయ్య, రాము, అర్గనైజర్లు రాజు, సామెల్, వెంకటేశ్, సీమోన్, రవి, మహేందర్, శ్రీహరి, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మళ్లీ.. అవిశ్వాసం లొల్లి

- అప్పుడు చైర్ పర్సన్, ఇప్పుడు వైస్ చైర్మన్
- యాదగిరిపై ఆవిశ్వాస నోటీసులు
- కలెక్టర్‌కు అందజేసిన 16 మంది కౌన్సిలర్లు
- వైస్ చైర్‌పర్సన్ రేస్‌లో బర్ల మంగ



యాదగిరి



మంగ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మళ్లీ అవిశ్వాస ముసలం పుట్టింది. గత నెలలో చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. ఈ తతంగం మరువక ముందే.. ఇప్పుడు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు నోటీసులు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై అవిశ్వాసం ప్రకటిస్తూ 16 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు సోమవారం నోటీసులు అందజేశారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం..

యాదగిరిపై కాంగ్రెస్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీర్మానంపై సంతకాలు చేయడం విశేషం. మున్సిపాలిటీ పరిధిలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా, అందులో 16 మంది యాదగిరిని వ్యతిరేకిస్తూ అవిశ్వాసాన్ని ప్రకటించడం శోచనీయం. చైర్ పర్సన్ కప్పరిపై అవిశ్వాసం పెట్టే అంశంపై కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు వైస్ చైర్మన్‌పై ఉన్నాయి. గత నెల 16న చైర్‌పర్సన్ స్రవంతిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎలాగైనా యాదగిరిని పదవి నుంచి తప్పించాలని చైర్ పర్సన్ వర్గీయులు భావించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే రాజకీయంగా పావులు కదుపుతూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్లను తమ వైపునకు తిప్పుకుని, ఆకులపై అవిశ్వాసం ప్రకటించిన విశ్వసనీయ సమాచారం. యాదగిరిని పదవి నుంచి దించేందుకు ప్రత్యర్థులు చేస్తున్న ప్రయత్నాలు ఏమేరకు సఫలీకృతమౌతాయో, దీనిని ఏ రకంగా ఆకుల తిప్పికొడతారో వేచిచూడాల్సిందే.

రేసులో మంగ..

యాదగిరిని పదవి నుంచి తప్పించినట్లయితే.. ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన బర్ల మంగ ఆరాట పడుతున్నారు. ఈ మేరకు ఆమెను ఎన్నుకోవాలని అసంతృప్తి కౌన్సిలర్లు నిర్ణయించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న బర్ల జగదీశ్వర్ యాదవ్.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొన్నారు. ఆయన సతీమణి మంగ వైస్ చైర్ పర్సన్ బరిలో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు కౌన్సిలర్లను క్యాంపునకు జగదీశ్వర్ యాదవ్ తరలిస్తున్నట్లు తెలుస్తోంది.